# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 17-01-2025 సంపుటి : 06 సంచిక : 245 పేజీలు : 8 వెల : రూ 3-00



## 18 న మెగా రక్తదాన శిబిరం
### మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆహ్వానం

రామచంద్రపురం, జనవరి 16 విశ్వవిఖ్యాత నటసార్వ భౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి , తెలుగు జాతి ముద్దుబిడ్డ, దివంగత నంద మూరి తారక రామారావు వర్ధంతి సందర్భం గా ఈనెల18 నఉదయం9 గంటలకు రామ చం ద్రపురం రత్నంపేటలోని లయన్స్ కల్యా ణ మండపంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ రక్త దాన శిబిరంలో కూటమి నాయకులు, కార్యకర్త లు, అభిమానులు, ఉత్సాహవం తులైన యువకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని మంత్రి సుభాష్ ఈసందర్భంగా పిలుపునిచ్చారు.






## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, జనవరి 16( విభారె) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రధానంగా ఇస్రోలో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దాదాపు రూ.3,985 కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రోదసిలోకి మానవుడిని పంపే ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా గుడ్ న్యూస్ చెప్పింది కేంద్రం. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలో వేతన సంఘం చైర్మన్‌ను నియమించ నున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.

## ప్రకాశం జిల్లాలో విషాదం..
### సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

అమరావతిజనవరి 16( విభారె) : ఏపీలోని ప్రకాశం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. సముద్ర స్నానానికి వెళ్లిన ఐదుగురిలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. సింగరాయకొండ పాకల బీచ్‌లో గురువారం ఐదుగురు సముద్రస్నానానికి వెళ్లారు. సముద్రంలో అలల తాకిడికి ఐదుగురూ గల్లంతయ్యారు. గల్లంతైన ఇద్దరిలో ఒకరిని జాలర్లు కాపాడగా మరో ముగ్గురు మృతి చెందారు. మరొకరి కోసం మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. మృతులు పొన్నలూరు మండలం తిమ్మపాలెంకు చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాలను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## రోడ్డు భద్రత పై కరపత్రాలు విడుదల
### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




( విభారె) నంద్యాల జనవరి 16--రోడ్డు భద్రత మాసోత్సవాలలో వాహన చోదకులను భాగస్వాములు చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాలు, ఫ్లెక్సీ బ్యానర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈ నెల 16 నుండి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా సంబంధిత శాఖల అధికారులు వాహన చోదకులు, ప్రజలు, విద్యార్థులను భాగస్వామ్యులను చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు సంబంధించిన బ్లాక్ స్పాట్స్ గుర్తించి క్లియర్ చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. మోటార్ సైకిల్ నడుపుతున్నప్పుడు హెల్మెట్ ని ధరించడం, హెల్మెట్ యొక్క ప్రాధాన్యతను తెలియజేయడం అలాగే కారులో ప్రయాణిస్తున్నప్పుడు సీట్ బెల్ట్ ను ధరించడం దాని యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడం అలాగే మద్యం సేవించి వాహనాలను నడపడం వలన జరిగే అనర్థాలను వివరించి వాటికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ వివరించారు.

# ఏపీలో పీ3 విధానం గేమ్ ఛేంజర్ లాంటిది : చంద్రబాబు




అమరావతిజనవరి 16( విభారె) : రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండేందుకు ప్రత్యేక విజన్‌ను తీసుకొస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. పీ3 విధానం గేమ్ ఛేంజర్ కానున్నదని పేర్కొన్నారు. విజయవాడలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడమే తమ లక్ష్యమని అన్నారు.వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఫ్యామిలీ (పీ3) విధానంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. సంపద సృష్టించాలంటే అభివృద్ధి జరగాలి. అభివృద్ధి వల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదాయం పెరిగితే పేదవారిని పైకి తీసుకురావచ్చని వివరించారు. ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికం నిర్మూలించవచ్చని ఆయన అన్నారు.వచ్చిన 7 నెలల్లోనే స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటరీ 2047ను పది సూత్రాలతో మళ్లీ విజన్‌ను తీసుకొచ్చామని వివరించారు. దీనికి దేశంలో ఎక్కడా లేని విధంగా 16 లక్షల మంది తిలకించారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీని తీసుకొచ్చినప్పుడు తిండిపెడ్తుందా అని ఎగతాళి చేశారని, ప్రస్తుతం ఐటీ సెక్టర్ అత్యున్నత స్థాయిలో ఉందని అన్నారు. ఐటీ లేనిదే ప్రపంచ లేదని తెలిపారు. హైదరాబాద్ నగరం ఐటీగా అభివృద్ధి చేయడంతో ప్రభుత్వానికి ఆదాయం ఐటీ నుంచే అధికంగా వస్తుందన్నారు.గత వైసీపీ ప్రభుత్వం అమరావతిని , పోలవరాన్ని భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడం తన లక్ష్యమని, 42వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యమని వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల వల్ల రాబోయే ఐదేండ్లకు రూ. 1,20,056 కోట్ల ఆదాయం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.

# కొత్త ఏడాదిలో ఇస్రో సరికొత్త రికార్డ్..




నెల్లూరు, జనవరి 16( విభారె) : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో నూతన ఏడాది ప్రారంభంలోనే మరో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల నింగిలోకి పంపిన రెండు ఉపగ్రహాలను విజయవం తంగా అనుసంధానం చేసింది ఇస్రో. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగాపూర్తిఅయినట్లుఇస్రో ఈరోజు (గురువారం) ఎక్స్ వేదికగా వెల్లడించింది. గత డిసెంబర్ 30న షార్ నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సీ 60 పీఎస్ఎల్వీలో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపించింది.ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ బయలుదేరిన 15 గంటల 9 నిమిషాలకు స్పేడెక్స్ 1బీ, 15 గంటల12 నిమిషాలకు స్పేడెక్స్ 1ఏ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తరువాత వీటి డాకింగ్ కోసం మూడు సార్లు ప్రయత్నించగా పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. చివరకు ఈరోజు(గురువారం) వీటి అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలోనే రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకువచ్చారు. అక్కడ ఉపగ్రహాలను హోల్డ్ చేసి డాకింగ్‌ను మొదలుపెట్టారు.ఇది విజయవంతం అయినట్లు ఇస్రో తమ పోస్టులో తెలియజేసింది. దీని కోసం శ్రమించిన సాంకేతిక బృందానికి, యావత్ భారతీయులకు అభినందనలు తెలిపింది. ఇప్పటి వరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. ఈ ప్రయోగంతో ఈ తరహా సాంకేతికతలో భారత్ కూడా వాటి సరసన చేరింది. మొత్తానికి ఇస్రో మరో మైలురాయి చేరింది. రెండు ఉపగ్రహాలను సాంకేతికంగా అనుసంధానం చేసే వరుసలో భారత్ చేరింది.అంతరిక్షంలో స్పేడెక్స్ డాకింగ్ అనేది శాస్త్ర, సాంకేతికపరంగా చాలా క్లిష్టమని చెప్పుకోవచ్చు. కానీ ఇస్రో మాత్రం స్పేడెక్స్ డాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసి అంతరిక్షంలో రెండు శాటిలైట్స్‌ను దగ్గరకు చేర్చి మరోసారి ప్రపంచ దేశాలకు భారత్ సత్తా ఏంటో చూపించింది. చైనా, రష్యా, అమెరికా సరసన భారత్‌ను చేర్చి ప్రతీ భారతీయుడు గర్వించేలా చేసింది ఇస్రో. దాదాపు వందకిలోల మీటర్ల వేగాన్ని ఒక్కసారిగా 0.013 కిలోమీటర్ల వేగానికి తగ్గించి అనుసంధానం చేయాల్సి ఉంటుంది. 220 కేజీల బరువున్న ఒక్కో శాటిలైట్‌ను ఒక్కచోటకు చేర్చి కలిపారు. రెండు ఉపగ్రహాలను ఒకదగ్గరకు చేర్చడంలో ఇస్రో సక్సెస్ అవడంతో ఇస్రోలో సంబరాలు చేసుకుంటున్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి :జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



విభారే న్యూస్.కర్నూలుప్రతినిధి , జనవరి, 16 : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ, బ్యారికేడింగ్, వైట్ వాష్ వంటి ఏర్పాట్లతో పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ ను వేడుకలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు..అలాగే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని, సీటింగ్ తదితర ఏర్పాట్లను చేయాలని కర్నూలు ఆర్డీవో ను ఆదేశించారు ..ఎక్కువ సేపు పిల్లలు ఎండలో నిలబడకుండా 30 నుండి 45 నిమిషాల లోపు సాంస్కృతిక కార్యక్రమాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డి ఈ ఓ ను ఆదేశించారు.. అన్ని శాఖల నుండి ప్రభుత్వ పథకాల వివరాలను క్రోడీకరించి సందేశాన్ని రూపొందించాలని, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ సమాచార శాఖ అధికారిని ఆదేశించారు..అదే విధంగా పరేడ్ గ్రౌండ్స్ లో త్రాగు నీటి ఏర్పాట్లు,పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని డీఎంహెచ్ ఓ ను ఆదేశించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తున్న వారికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు సిఫార్సు చెయ్యాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలును ప్రతిబింబిస్తూ శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు..సమావేశంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు

## 18న ఆంధ్రప్రదేశ్ పర్యటనకు అమిత్ షా



అమరావతిజనవరి 16( విభారె) : కేంద్ర హోంమం త్రి అమిత్ షా శనివారం (18వ తేదీ) ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రానున్నారు. కృష్ణాజిల్లా , గన్నవ రం సమీపంలో నిర్మిం చిన ఎన్డీఆర్ ఎఫ్ ఎన్ఐడీఎం ప్రాంగణాలను కేంద్ర హోం మంత్రి ప్రారంభించను న్నారు. శనివారం రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరానికి వస్తారు.ఆరోజురాత్రి ఉండవల్లిలోని సీఎం చంద్ర బాబు నివాసంలో అమిత్ షాకు విందు ఏర్పాటు చేశారు. అనంతరం విజయవాడలోని హోటల్లో బస చేస్తారు. 19న ఉదయం ఎన్ఐడీఎం కేంద్రం, ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్‌ను ఆయన ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు రామ్మోహన్నా యుడు, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులు పాల్గొంటారు. ప్రారంభో త్సవం తర్వాత అమిత్ షా బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు .విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్మించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు పదో బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ క్యాంపులను అమిత్ షా ప్రారంభిస్తారు. ఇవి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనివి కావడంతో ఆయన ప్రత్యేకంగా వస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా కూడా ఆసక్తి రేపుతోంది. అమిత్ షా పర్యటన కోసం ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. సాధారణంగా రాజకీయాలను అమిత్ షానే పట్టించుకుంటుంటారు. పాలన పరంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజీగా ఉంటారు. అయితే అంతిమ నిర్ణయం తీసుకునేది ప్రధాని మోదీనే. పనులన్నీ చక్కబెట్టేది అమిత్ షా. ఏపీ పర్యటనలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ ముగ్గురి మధ్య రాజకీయ చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సంపాదకీయం

**శుక్రవారం 17-01-2025**

## ఆధ్యాత్మిక వేడుకలో రికార్డులు

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా సంరంభం మొదలైంది. జనవరి 13న పౌర్ణమినాడు మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగుస్తుంది. 45 రోజుల పాటు మినీ భారతాన్ని తలపించే విధంగా సాగే ఈ మహా కుంభమేళా కోసం పవిత్ర త్రివేణీ సంగమమైన ప్రయాగ్‌రాజ్ భక్త జన సందోహంతో కిటకిటలాడనుంది. దాదాపు 40 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తరిస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. దేశ జనాభాలో ప్రతి నలుగురిలో ఒకరు వస్తారన్న మాట. వీరే కాకుండా విదేశాలలోని ప్రవాస భారతీయులు, విదేశీయులు కూడా పెద్దసంఖ్యలో ఇప్పటికే ప్రయాగ్ రాజ్‌కు చేరుకున్నారు. ఈ మహా ఉత్సవం కోసం ఏడాది ముందునుంచే ఏర్పాట్లు మొదలయ్యాయి. రూ.12,700 కోట్ల బడ్జెట్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ఏర్పాట్లు చేశాయి. పవిత్ర స్నానాలు ఆచరించడం కోసం వచ్చే లక్షలాది భక్తుల కోసం త్రివేణీ సంగమం వద్ద ఓ తాత్కాలిక మహా నగరమే ఏర్పాటయిందని చెప్పవచ్చు.దాదాపు పదివేల ఎకరాల్లో లక్షన్నర రెస్ట్ రూమ్‌లు, వేలాది వాష్‌రూమ్‌లు, అంబులెన్స్‌లు, వందలాది పడకలతో తాత్కాలిక ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. లక్షల సంఖ్యలో ప్రత్యేక బస్సులు, వేలాది ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. ఒక్క రైళ్ల ద్వారానే దాదాపు రెండు కోట్ల మంది వస్తారని రైల్వే శాఖ అంచనా. ఇక ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారి కోసం 5 లక్షల కార్ల పార్కింగ్‌కు సౌకర్యాలు కల్పించారు.కాలుష్య నివారణ కోసం పెద్ద సంఖ్యలో విద్యుత్ వాహనాల వినియోగం, అతిపెద్ద నదీ శుద్ధి కార్యక్రమం, వేల సంఖ్యలో పారిశుద్ధి కార్మికులు.. ఇలా ఎన్నెన్నో సదుపాయాలను కల్పించారు. మిగతా కుంభమేళాలకు భిన్నంగా 144 ఏళ్ల తర్వాత జరగనున్న ఈ మహా కుంభమేళాకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఆధ్యాత్మికతతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మిళితం చేసి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషం.వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, నీటి అడుగునుంచే పర్యవేక్షించే నిఘా కెమెరాలు, పడవలపైనుంచి నిఘా లాంటి ఎన్నెన్నో ఆధునిక సాంకేతికతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర పోలీసులతో పాటుగా వేల సంఖ్యలో పారా మిలిటరీ బలగాల సేవలను ఉపయోగించుకోనున్నారు. అందుబాటులో ఉన్న అన్ని సేవలను ఉపయోగించుకోవడం ద్వారా భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి.కుంభమేళాకు ప్రత్యేక ఆకర్షణ లక్షల సంఖ్యలో తరలివచ్చే సాధువులేనని చెప్పవచ్చు. హిమాలయాల్లో ఉండే నాగసాధువులతో పాటు వివిధ అఖారాలనుంచి లక్షల సంఖ్యలో సాధువులు ఈ మహా కుంభమేళాకు తరలి రానున్నారు. నాగసాధువులను దర్శించుకొని వారి ఆశీర్వాదాలు తీసుకోవడానికి భక్తులు ఎగబడతారు. మరోవైపు ఇన్ని కోట్లమంది భక్తులకు ఆహార, వసతుల కోసం వివిధ మఠాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా తమ శక్తివంచన లేకుండా ఏర్పాట్లు చేశాయి. అవసరమైన సమాచారాన్ని అందించడానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటుగా వందల సంఖ్యలో సమాచార కేంద్రాలు సిద్ధం చేసింది. రోజుకు కోటిమంది భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవాల ప్రారంభం సందర్భంగా యూపీ సీఎం యోగిఆదిత్యనాథ్ చెప్పడం గమనార్హం. ఇక తొలి రోజే కోటికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు చెప్తున్నారు.మకర సంక్రాంతినాడు తొలి రాజస్నానం మొదలు కాగా , మహా శివరాత్రినాటి రాజస్నానంతో మేళా ముగుస్తుంది. మహా కుంభం మొదటి రెండు రోజుల్లో 5.15 కోట్లమంది స్నానాలు చేయడం కూడా ఒక రికార్డేనట. తొలిరోజు మహాకుంభంలో 1.65 కోట్ల మంది స్నానాలు చేయగా,మకర సంక్రాంతి రోజున 3.50 కోట్ల మంది స్నానాలు చేశారట. హింస జరగలేదు... కులం, మతం, పౌరసత్వం గురించి ఎవరినీ అడగలేదు...ఎవరినీ కించపరచలేదు.. మరే ఇతర మతాన్ని కూడా చిన్నచూపు చూడలేదు.ప్రపంచం నలుమూలల నుంచి ఎందరో ధనవంతులు,స్వదేశీ, విదేశాల నుంచి అన్ని రకాల భక్తులు... ఎంతో భక్తిపూర్వంగా వచ్చి.. తమ తమ భక్తి శ్రద్ధలను ఆచరించి తరించి పరమానంద భరితులయ్యారో. ఇన్ని కోట్ల మందికి ఆహారం, నీరు తదితరాల ఏర్పాటు ఉంది...ప్రయాగ్‌రాజ్‌లో వసతి కూడా ఉంది... భక్తులకు ఇది పూర్తిగా ఉచితం...ఇలాంటి ఉదాహరణ ప్రపంచంలో ఎక్కడామనకూ కనిపించదు...ఈ ప్రయాగ్‌రాజ్ మహాకుంభం అతీంద్రియమైనది... మరపురానిది... ఊహకందనిది....ఇది కేవలం భారత్ లో మాత్రమే సాధ్యమవుతున్నది...ఇంత చిన్న నగరంలో ఇందరు భక్తులు రాక పోకలు సాగించడమా?ఇది కలయా నిజమా? అన్న మీమాంశను వదిలిప్రయాగ్ రాజ్ వెళ్లండి.. 144 ఏళ్ల తర్వాత జరుగుతోన్న మహాకుంభమేళానుఆస్వాదించి.. ఆ గంగామాయి ఆశీస్సులు పొందండి..ముక్కోటి దేవతల ఆశీర్వచనాలు అందుకోండంటూపిలుస్తోంది ఉత్తర ప్రదేశ్!!!మహాకుంభమేళా సందర్భంగా దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందని అంచనా. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన ఆధ్యాత్మిక పండుగగా భావించే ఈ మహాకుంభమేళాలో స్నానమాచరిస్తే ఆత్మశుద్ధిని పొందడమే కాకుండా భగవంతుడికి చేరువవుతారన్నది హిందువుల బలమైన విశ్వాసం. అందుకే ఈ ఆధ్యాత్మిక జనసంద్రం.

## జిల్లాలో ప్రజల అవసరాలకు ఉచిత ఇసుక రవాణా

- రిజిస్టర్ ట్రాక్టర్లలో మాత్రమే సరఫరా చేయాలి
- జిల్లాలోని 6 ఇసుక రీచ్ ల నుంచి అనుమతి
- నిర్దేశిత ధరకు మించి విక్రయిస్తే ట్రాక్టర్ సీజ్
- ఉదయం 8 నుంచి, సాయంత్రం 5 వరకు ఇసుకకు అనుమతి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి : సామాన్య ప్రజలు తమ సొంత అవసరాలకు జిల్లాలోని 6 రీచ్ ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకొని వెళ్లవచ్చని గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి సాండ్ కమిటి సమావేశం నిర్వహించి నూతన ఇసుక పాలసీ ఆమోదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ× జనవరి 16 నుంచి జిల్లాలో సామాన్య ప్రజలు తమ సొంత అవసరాలకు జిల్లాలోని 6 రీచ్ ల నుంచి ఉచితంగా ఇసుక తీసుకోవచ్చని అన్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో వినియోగించుకునేందుకు జిల్లా ప్రజలు సుల్తానాబాద్ లోని నీరుకుల్ల, గట్టెపల్లి, ముత్తారం లోని ముత్తారం, అడవి శ్రీ రాంపూర్, మంథని లోని విలోచవరం, అంతర్గాం లోని గోలివాడ ఇసుక రీచ్ లలో ఎక్కడి నుంచైనా ట్రాక్టర్లలో ఇసుక తీసుకోవచ్చని అన్నారు. ఇసుక రీచ్ ల నుంచి ఉచితంగా తీసుకునే ఇసుక సొంత అవసరాలకు మాత్రమే వాడాలని, ఈ ఇసుకను మన జిల్లా పరిధిలో మాత్రమే వాడాలని, ఎక్కడా ఇసుక డంప్ లు సృష్టించడానికి వీలు లేదని, ఇసుక డంప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించాల ని, సాయంత్రం 5 తరువాత ఇసుక తరలిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేసి మొదటి సారి 25 వేల జరిమానా, రెండవ సారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు. ఇసుక తరలింపు కోసం వినియోగించే ట్రాక్టర్ ఓవర్ లోడ్ కావడానికి వీలు లేదని, డ్రైవర్ కు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడానికి వీలు లేదని , వాహనానికి తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అన్ని వైపులా అంటించాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 6 ఇసుక రీచ్ లకు సంబంధిత తహసిల్దార్లు ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి, ప్రతి రోజు తరలించే ఇసుక వాహన వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అన్నారు. ప్రతి వారం ఇసుక తరలింపు వివరాలను కలెక్టర్ కు సంబంధిత తహసిల్దార్లు నివేదిక అందించాలని అన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్ ల నుంచి తీసుకునే ఇసుక ప్రజలకు జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ధర మించకుండా విక్రయించాలని అన్నారు. ట్రాక్టర్ ఇసుక పెద్దపల్లి పట్టణ ప్రాంతంలో 1400, సుల్తానాబాద్ లో 1000, జూలపల్లిలో 1700, ఓదెల లో 1150, శ్రీరాంపూర్ లో 1100, పాలకుర్తి లో 2500, అంతర్గాం లో 1000, రామగుండంలో 2600, మంథని లో 1500, ధర్మారంలో 2300, కమాన్ పూర్ 2200, రామగిరి లో 2200 మాత్రమే విక్రయించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాక్టర్ ఇసుక నిర్ణీత ధర కంటే అధికాంగా విక్రయిస్తే 08728 223318, 08728 223310 ఫోన్ నెంబర్ల ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఫిర్యాదు నమోదు చేస్తే సంబంధిత ట్రాక్టర్ల సీజ్ చేయడం జరుగుతుందని, మొదటి సారి 25 వేలు, రెండవ సారి 50 వేల జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 6 ఇసుక రీచ్ ల నుంచి పెద్దపెల్లి జిల్లా రిజిస్టర్ ట్రాక్టర్లు మాత్రమే ఇసుక తీసుకొని వెళ్లాలని, లారీలు, టిప్పర్లు వంటి పెద్ద వాహనాలు,జిల్లాల ట్రాక్టర్లు వినియోగించేందుకు వీలు లేదని అన్నారు.

## గోద్రా రైలు ఘటనపై ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టులో విచారణ



న్యూఢిల్లీ: 2002లో జరిగిన గోద్రా రైలు ఘటనపై.. ఫిబ్రవరి 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గుజరాత్ ప్రభుత్వంతో పాటు అనేక మంది దాఖలు చేసిన పిటీషన్లపై విచారణ చేపట్టనున్నది. ఈ కేసు విచారణకు మరో తేదీని ఇవ్వబోమనని జస్టిస్ జేకే మహేశ్వరి, అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది.2002, ఫిబ్రవరి 27వ తేదీన సబర్మతి రైలుకు చెందిన ఎస్-6 బోగీలో చెలరేగిన మంటల్లో సుమారు 59 మంది ప్రయాణికులు మరణించారు. ఆ కేసులో 2017లో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ అనేక మంది సుప్రీంలో అప్పీల్ చేసుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిన 11 మంది నిందితులకు మరణశిక్ష విధించాలని కోరుతూ గత ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్ సర్కారు సుప్రీంను ఆశ్రయించింది.అయితే గురువారం విచారణ సమయంలో ఓ నిందితుడి తరపున లాయర్ హాజరయ్యారు. కానీ ఆధారాలు సమర్పించలేకపోయారు. గత ఏడాది నుంచి ఈ కేసును ఇప్పటి అయిదు సార్లు వాయిదా వేశానని, ఇక మళ్లీ వాయిదా వేయబోమని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. కొందరు నిందితులకు చెందిన క్షమాభిక్ష పిటీషన్లు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు సుప్రీంకు లాయర్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వ అప్పీల్‌పై ముందుగా విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోరారు.

## బొగ్గు కుంభకోణం.. కేసు నుంచి తప్పుకున్న జస్టిస్ కేవీ విశ్వనాథన్



న్యూఢిల్లీ: బొగ్గు కుంభకోణంపై నమోదు అయిన కేసులపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ కేసుల్ని విచారిస్తున్న ధర్మాసనం నుంచి సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ కేవీ విశ్వనాథన్ తప్పుకున్నారు. ఓ కేసులో తాను లాయర్‌గా వాదించినట్లు ఆయన పేర్కొన్నారు. బొగ్గు స్కామ్‌పై కేసుల విచారణకు కొత్త ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. సుప్రీం ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కుమార్ కూడా ఉన్నారు.ఫిబ్రవరి 10వ తేదీ నుంచి జరిగే విచారణల కోసం కొత్త త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. బొగ్గు కుంభకోణాలపై హైకోర్టుల్లో విచారణ చేపట్టరాదు అని గతంలో సుప్రీం పేర్కొన్నది.


## తెలంగాణ ప్రజల డబ్బుతో నీ దోస్తులను కాపాడిన ఘనత నీది..కె టి ఆర్



**తెలంగాణ ప్రజల చెవిలో పువ్వు పెట్టకు... కె టి ఆర్**
**నువ్వు మహా డ్రామా రావు అని తెలుసు ప్రజలకు**
**నీ నటనకు ఆస్కార్ అవార్డు వచ్చే అవకాశం ఉంది**
**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్,జనవరి 16, (న్యూస్ పల్స్) ఎఫ్ఈవో ఫార్ములా ఈ ఆపరేషన్స్ అనేది హైదరాబాద్ కి నేనే తీసుకొచ్చాను, దానిని కాపాడాలని ఇది హైదరాబాద్ కి తలమానికం అని, అందుకోసమే హెచ్ఎండిఏ నుంచి 55 కోట్ల రూపాయలు ఖర్చు చేశానని గొప్పలు, ప్రగల్బాలు పలుకుతున్నావు కేటీఆర్, నిజ నిజాలు వాస్తవాలు తెలంగాణ ప్రజలకు తెలుసని . భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఏస్ నెక్స్ట్ జెనరేషన్స్ గ్రీన్కో సంస్థ యాజమాన్యం నీకు అత్యంత దగ్గర మిత్రులు. వారిని కాపాడటానికి సీజన్ 1కి వాగ్దానం చేసిన 90 కోట్ల చెల్లించని కారణంగా 30 కోట్లు ఇచ్చి, 60 కోట్లు ఇవ్వకపోవడం వల్ల వాళ్లు నోటీసులు జారీ చేసి, కాంట్రాక్టు రద్దు చేస్తామని చెప్తే, నీ మిత్రులు గ్రీన్ కో ప్రమోటర్స్ ను నీ బాల్య మిత్రులను కాపాడడం కోసం అక్టోబర్ 2023లో హెచ్ఎండిఏ నిధుల నుండి నిధులు ట్రాన్స్ఫర్ చేసి వారిని కాపాడడం జరిగింది మీరు. దానికి గ్లోబల్ హైదరాబాదును కాపాడడం కోసమే అని గొప్పలని అన్నారు. నీ మిత్రులకు తెలంగాణ సంపదను దోచిపెట్టినవ్ అని తెలంగాణ ప్రజలకు క్లియర్ గా తెలుసు. నువ్వు స్వాతంత్ర్య సమరయోధునిగా , ఏదో దేశానికి గొప్ప చేశాను అనే విధంగా గొప్పలు చెప్తున్నావ్ ఈ కార్ రేస్ విషయంలో నీ గురించి,నీ వ్యవహారం గురించి, ఈ కార్ రేస్ విషయంలో ఏం జరిగింది అనే విషయం గురించి ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

## మహబూబాబాద్ జిల్లాలో దారుణం.. కోడలిని చంపి ఇంట్లోనే పూడ్చివేత




మహబూబాబాద్ : మూడు ముళ్ల బంధం ఒక్కటైన ఆ యువతి కోటి ఆశలతో అత్తగారింట అడుగు పెట్టింది. కలకాలం తోడుంటానని మనవాడిన భర్తే ఆమె పాలిట యముడయ్యాడు. అగ్ని సాక్షిగా చేసిన బాసలు మరిచి తల్లిదండ్రులతో కలిసి భార్యను కిరాతకంగా హతమార్చారు. ఇంట్లోనే పూడ్చి పెట్టారు. ఈ విషాదకర సంఘటన మహబూబాద్ లోని సిగ్నల్ కాలనీలో చోటు చేసుకుంది.హత్య చేసిన అనంతరం ఇంటికి తాళం వేసి భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు పరారయ్యారు. స్థానికుల ఫిర్యాదుతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. పాతిపెట్టిన చోట తవ్వగా వివాహిత మృతదేహం బయటపడింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## షాబాద్ లో రైతు దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

చేవెళ్ల ,చేవెళ్ల మండల కేంద్రంలోని బిఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పట్లలో కార్తీక్ రెడ్డి, సీనియర్ నాయకులు అనంతరెడ్డి పాల్గొన్నారు.పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.శుక్రవారం షాబాద్ లో రైతు దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు పిసిసి అధ్యక్షునిగా ఉండి అనేక అడ్డగోలు హామీలు ఇచ్చారు. ప్రజలకు గాని రైతులు గాని ఒక గ్యారెంటీ కార్డు చేయించి ఇంటింటికి తిరిగి కార్యకర్తలు చూపెట్టారు. 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు.మహిళలకు బస్సు మాత్రమే ఫ్రీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పెద్ద ఎత్తున బహిరంగ సభలో సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి చేయలేదు రేవంత్ రెడ్డి..? గతంలో చూస్తే మంత్రులు ఇష్టానుసారంగా 46 కోట్ల అరుణమాఫీ అయితదని వాగ్దానాలు చేస్తున్నారు. క్యాబినెట్ మీటింగ్ పెట్టి 42 కోట్ల అని చెప్పారు. మరొకసారి 26 వేల కోట్లు అన్నారు. 18 కోట్ల రుణమాఫీ చేసినవని ప్రకటించారు. స్టేట్ వైస్ గా చూస్తే 7 కోట్ల కన్నా ఎక్కువ రుణమాఫీ ఎక్కడ కాలేదని అన్నారు. 35% గూడంగా తెలంగాణ రాష్ట్రంలో రుణమాఫీ జరగలేదు. గ్రామంలో అయినా రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో కూడా 35% పేజీ రుణమాఫీ కాలేదు. ఏ గ్రామానికి అయినా వెళ్లి గ్రామసభ పెడదాం ఎక్కడైనా రుణమాఫీ జరిగిందా అని చర్చిద్దాం. 40 పర్సెంట్ వస్తే రాజకీయంకు రాజీనామా చేస్తాం. ప్రజలు ఎంత మొత్తుకున్నా చీమకుట్టినట్టు కూడా రేవంత్ రెడ్డి కావట్లేదు. కెసిఆర్ ప్రభుత్వంలో ప్రజలకు 5000 ఇచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మనిషికి 7000 వస్తాయని అన్నారు. నామమాత్రానికి 6 గ్యారంటీలు అమలు చేయలేక చికమకం అవుతున్నారు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.. ప్రజలు ఇప్పటికైనా గమనించి రేపు చేయబోయే తెలంగాణ రాష్ట్ర రైతుబిక్ష కార్యక్రమానికి ప్రజలు జిల్లాల నుండి అధిక సంఖ్యలో పాల్గొనని విజయవంతం చేయాలని కోరారు..

## యాదాద్రిలో ఘోర రోడ్డు ప్రమాదం? ఇద్దరు మృతి




యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై భువనగిరి మున్సిపాలిటీ రాయగిరి సమీపంలో వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి వెనక నుండి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ మహిళ, చిన్నారి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.మృతులు మహబూబాబాద్ జిల్లా కేసముద్రంకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వరంగల్ నుండి హైదరాబాద్ వైపు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. పెట్రోల్ పంపులోకి వెళ్తున్న లారీని వెనుక నుండి కారు బలంగా ఢీకొట్టడంతో ప్రమాద సంభవించిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టీడీపీ– జనసేన మధ్య విభేదాలు ఉన్నాయా

విజయవాడ, జనవరి 16 దేశంలో వన్ నేషన్ – వన్ ఎలక్షన్ గురించి చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రా రాజకీయాలు ఊహించని టర్న్ తీసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇంకా ఏడాది కూడా కాలేదు. అప్పుడే చీలిక వచ్చే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అందుకు కారణం గతంలో, తాజాగా పరిణామాలపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలేనని చర్చ జరుగుతోంది. 1. ఈనెల 8న తిరుపతిలో తొక్కిసలాట జరిగింది. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈఘటనపై టీడీపీ చీఫ్, ముఖ్యమంత్రి చంద్రబాబు దూకుడు వైఖరిని ప్రదర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం టోకెన్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. తొక్కిసలాట జరగడానికి కారణం ఇదేనని వ్యాఖ్యానించారు. కానీ.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇందుకు విరుద్ధంగా స్పందించారు. ఈ విషాదానికి కారణమైన వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 2. ఈ ఘటనపై ఆరాతీసిన ప్రభుత్వం.. అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఘటన జరిగినప్పుడు పర్యవేక్షించిన డీఎస్పీ రమణ కుమార్, టీటీడీ శ్రీ వెంకటేశ్వర గోసంరక్షణశాల డైరెక్టర్ కె.హరనాథ్ రెడ్డి ఇద్దరినీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత కూడా మరికొందరు అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇక్కడితో వివాదం ముగిసిందని అంతా అనుకున్నారు. 3. గతేడాది సెప్టెంబర్‌లో తిరుపతి లడ్డూ వివాదం జరిగింది. ఈ వివాదంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును 'స్వచ్ఛమైన' నెయ్యితో కలపడానికి అనుమతించారని టీడీపీ, జనసేన ఆరోపించాయి. కచ్చితమైన ఆధారాలు లేనప్పటికీ.. పవన్ కళ్యాణ్ కాషాయ వస్త్రాలు ధరించి 11 రోజుల దీక్ష చేశారు. సనాతన ధర్మాన్ని అణగదొక్కడానికి జగన్, నకిలీ లౌకిక శక్తులు కుట్ర పన్నాయని ఆరోపించారు. 4. తాజాగా తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో కళ్యాణ్ మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే.. దేవాదాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి సహా వేరే ఇతర టీడీపీ నాయకుల నుండి ఇలాంటి డిమాండ్లు రాలేదు. 5. కళ్యాణ్ డిమాండ్ గురించి అడిగినప్పుడు.. టీటీడీ ఛైర్మన్.. క్షమాపణ చెప్పడం వల్ల చనిపోయినవారు తిరిగి రారు. తాము బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాము.. ఎవరో క్షమాపణ కోరారని తాను క్షమాపణ



చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అసలు వివాదం ఇక్కడే మొదలైంది. 6. బీఆర్ నాయుడు క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో.. జనసేన, బీజేపీ, సంఘ్ పరివార్ – టీడీపీ మద్దతుదారుల మధ్య సోషల్ మీడియా యుద్ధం మొదలైంది. ఇది పెద్ద వివాదంగా మారకముందే.. టీడీపీ జాగ్రత్త పడింది. పవన్ డిమాండ్ చేసిన రెండు రోజుల తర్వాత.. బీఆర్ నాయుడు క్షమాపణలు చెప్పారు. ఆయన గతంలో ధిక్కార వైఖరిని ప్రదర్శించినప్పటికీ.. ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడంతో క్షమాపణలు చెప్పారని ప్రచారం జరుగుతోంది. 7. ఈ మొత్తం ఎపిసోడ్‌లో పవన్ కళ్యాణ్ రాజకీయ విజేత అనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి నిందను పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీపై విజయవంతంగా మోపారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. 8. పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యూహాన్ని అనుసరించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో మహిళలపై పెరుగుతున్న నేరాలపై స్పందిస్తూ.. డీజీపీ, హోంమంత్రిని విమర్శించారు. బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత హోంమంత్రి తన విధులను సమర్థవంతంగా నిర్వహించలేకపోతే.. తాను హోం మంత్రిత్వ శాఖను చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. 9. సానుకూల పరిణామాలను పవన్ తన ఖాతాలో వేసుకుంటూ.. లోపాలను సమర్థవంతంగా టీడీపీ ఖాతాలోకి నెట్టేస్తున్నారనే రాజకీయ అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే సమయంలో.. సనాతన ధర్మ రక్షకుడిగా పవన్ తనకు తాను ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు బీజేపీ, ఇటు సంఘ్ పరివార్ పవన్‌కు సపోర్ట్‌గా నిలుస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. 10. తాజా పరిణామాలతో తెలుగుదేశం పార్టీలో ఆందోళన మొదలైందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో హిందూ ఓట్ల ఏకీకరణ, పవన్ కళ్యాణ్, బీజేపీ ప్రభావం పెరగడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో లోకేష్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో.. ఓ ప్రముఖ మీడియాలో 'ఉప ముఖ్యమంత్రి' సాంకేతికంగా రాజ్యాంగబద్ధమైన పదవి కాదని, కళ్యాణ్ మంత్రివర్గంలోని ఇతర మంత్రుల మాదిరిగానే ఉంటారనే కథనం వచ్చింది. దీనిపైనా జనసైనికులు గుర్రుగా ఉన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో జనసేన వర్సెస్ టీడీపీ ఫైట్ జరుగుతుంటే.. జనసేనకు బీజేపీ, సంఘ్ పరివార్ మద్దతు ఇస్తున్నాయి. ఇందుకే కూటమిలో చీలిక వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

# భారీగా మద్యం అమ్మకాలు?.




భీమవరం, జనవరి 16 రాష్ట్రంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్న వేళ కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడల్లో కోట్లు చేతులు మారుతున్నాయి. డబ్బులు వచ్చిన వారు ఆనందంతో ఇళ్లకు వెళ్తున్నారు. డబ్బులు పోయినవారు దుఃఖంతో ఇంటికి వెళ్తున్నారు. భోగి రోజున ప్రారంభమైన కోడి పందేలు, పేకాట, గుండాట రాత్రి పగలు తేడా లేకుండా నిరాటంకంగా కొనసాగుతోన్నాయి. అక్కడే భోజనం, మందు, నీళ్లు, ఇతర తినిబండరాళ్లు స్టాల్స్ పెట్టి అమ్మడంతో పందె రాయుళ్లు, జూద క్రీడలు ఆడేవారు అక్కడ నుంచి వెళ్లటం లేదు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం లాటరీ పద్ధతిలో మద్యం షాపులను కేటాయించింది. దీంతో రాష్ట్రంలోని విచ్చల విడిగా బెల్ట్‌షాప్‌లు పుట్టుకొచ్చాయి. ఈ సంక్రాంతి వేళ కొత్తగా సంతలో స్టాల్స్ మాదిగా మద్యం స్టాల్స్ వచ్చాయి. కోడి పందేలు జరుగుతున్న ప్రాంతాల్లో స్టాల్స్ పెట్టి మరి అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతోంది. స్టాల్స్ పెట్టి మద్యం అమ్మేవారికి స్థానిక అధికార పార్టీ నేతలు అండదండలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. పైగా కోడి పందేల బరుల నిర్వహకులు కూడా వీరికి మద్దతుగా నిలవడంతో ఎవరు ఏమీ అనడం లేదు. ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా వారి జోలికి పోవటం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. కోడి పందేల బరుల వద్ద భారీగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దేవిపట్నం మండలంలోని ఎం.రావిలంక గ్రామ శివార్లలో మామిడ తోట వద్ద జోరుగా కోడి పందేలు, నంబర్ గుండాట జరుగుతోంది. అక్కడ కోడి పందేలు ప్రాంగణంలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ తరహాలోనే మద్యం సీసాలు పెట్టి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. బహిరంగంగా మద్యం అమ్మే వారిలో మహిళలు కూడా ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక్క భోగి రోజే అధికారిక లెక్కల ప్రకారం రూ. 28.40 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇంకా సంక్రాంతి, కనుమ రోజుల లెక్కలు చూస్తే? మరింత పెరుగుతుంది. కాకినాడ జిల్లాలో రూ. 11.25 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ. 7 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో రూ. 10.15 కోట్ల మద్యాన్ని ఆయా జిల్లాల్లోని ఉన్న దుకాణాలు కొనుగోలు చేశాయి. గతేడాది భోగి రోజు రూ. 12.60 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అంటే గతేడాది కంటే ఈసారి రూ. 15.80 కోట్లు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా డిస్టలరీల స్టోర్లు విక్రయించిన లెక్కల ప్రకారమే. అయితే అక్రమంగా మద్యం ఏరులై పారడంతో ఈ లెక్క మారుతుంది. మద్యం ఒక్కటే కాదు సారా కూడా పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి?!

# ఐదు నెలల నుంచి జీతాల్లేవ్

విశాఖపట్టణం, జనవరి 16,ప్రతిష్ఠాత్మక వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు.. పండగ పూట కూడా పస్తులే ఉంటున్నారు. ఐదు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వటం లేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ.. కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 9,460 మంది శాశ్వత అధికారులు, ఉద్యోగులు, 12 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల? ఉన్నారు. వీరికి గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వటం లేదు. సెప్టెంబర్‌లో 50 శాతం, అక్టోబర్ 25 శాతం, నవంబర్‌లో 25 శాతం, డిసెంబర్‌లో 35 శాతం మాత్రమే ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు నాలుగైదు నెలల నుంచి పూర్తిస్థాయి జీతాలు ఇవ్వటం లేదు. హెఆర్‌ఏ, ఎల్‌టీసీ, ఎల్‌ఎల్‌టీసీ, దసరా, దీపావళి బోనస్‌ను పూర్తిగా ఆపేశారు. వేతన సవరణ జరగలేదు. కార్మికులను సాగనంపేందుకు యాజమాన్యం కుట్రకు తెరతీసింది. కార్మికులను సాగనంపేందుకు సిద్ధమైంది. వీఆర్‌ఎస్ పథకం అమలుకు ఆర్‌ఐఎన్‌ఎల్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ నోటిఫికేషన్‌లో 45 ఏళ్ల వయసు, 15 ఏళ్ల సర్వీస్ పూర్తి అయిన వారు వీఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. తద్వారా 2025 మార్చిలోపు వెయ్యి మందిని బయటకు పంపేందుకు యాజమాన్యం సిద్ధమైంది. గత ఐదేళ్ల నుంచి ప్రతి ఏడాది 1000 నుంచి 1,100 మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. వారిస్థానంలో నియామకాలు జరగటం లేదని సీఐటీయూ నేత కేఎం శ్రీనివాస్ వివరించారు. జీతాల కోత విధింపు, ఉద్యోగులకు జీతాల కోత వంటి చర్యలతో కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. మరోవైపు బలవంతగా వీఆర్‌ఎస్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికి ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని విశాఖ ఉక్కు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. జీతాలు లేకపోతే పండగ ఎలా చేసుకోవాలంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఈ దౌర్భాగ్య పరిస్థితికి కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలే కారణమని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్–ఆర్‌ఐఎన్‌ఎల్)ను ప్రైవేటీకరణ చేసేందుకు మొగ్గు చూపుతోంది. ఇప్పటికే కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో చర్యలకు పూనుకుంటుంది. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌లోని ఒక్కో భాగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి ప్రకటన వెలువడిన తరువాత ఒక్కొక్క చర్యలు చేపట్టిందిఇప్పటికే దాదాపు 2,000 మంది ఉద్యోగులను ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్‌నర్ స్టీల్‌ప్లాంట్‌కు పంపడానికి సిద్ధపడింది. అలాగే 4,200 మంది స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తొలగించేందుకు వారికి ఎంట్రీ, ఎగ్జిట్ పాస్‌లను ఇవ్వకుండా కుట్రలు చేసింది. కార్మికులు పోరాటంతో యాజమాన్యం వెనక్కి తగ్గింది. అలాగే బ్లాస్ ఫర్నేస్‌ను నిలిపివేసింది. ఆక్సిజన్ ప్లాంట్‌ను నిలిపివేసింది. మళ్లీ కార్మికుల ఆందోళనతో వెనక్కి తగ్గింది. ఇలాంటి కుట్రలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిపై ప్రభావం చూపే విధంగా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం చర్యలకు పూనుకున్నాయి. తాజాగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఒక యూనిట్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు రంగం సిద్ధం అయ్యింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఫైర్ స్టేషన్ నడిపే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబందించి వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానించింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఆర్‌ఎంహెచ్‌పీ, సింటర్ ప్లాంట్, కోక్ ఓవెన్స్, స్టీల్‌మెల్ట్ షాప్, బ్లాస్ట్‌ఫర్నేస్, రోలింగ్ మిల్స్, ఎయిర్ సెపరేషన్ ప్లాంట్, సీఆర్‌ఎంపీ, థర్మల్ పవర్ ప్లాంట్, ఎల్‌పీజీ స్టోరేజ్ ట్యాంక్‌లు, వాటర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, గ్యాస్ హోల్డర్లు, ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, స్టీల్‌ప్లాంట్‌లోని ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ తదితర కీలకమైన విభాగాల్లో ఫైర్ స్టేషన్ సేవలు అందిస్తుంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాగ్ధానం చేశారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటి ప్రైవేట్ పరం అవుతుంటే కనీసం స్పందించడం లేదు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కానీ ఆయన కూడా మౌనం దాల్చడంపై స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీ భరత్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పందించడం లేదు. అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు కోరిన రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి అయిన తరువాత.. స్టీల్‌ప్లాంట్ గురించి కనీసం పట్టించుకోవడం లేదని కార్మికులు విమర్శిస్తున్నారు.

# కనిపించని ప్రతిపక్షం

గుంటూరు, జనవరి 16, ఏ అవకాశం వచ్చినా అంది పుచ్చుకోవాలి. అదే రాజకీయం. చంద్రబాబు ను చూసైనా నేర్చుకుంటారా? అంటే అదీ లేదు. ఎందుకంటే నాలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి నేటి తరం రాజకీయ నేతలు, పార్టీ అగ్రనేతలు ఎన్నో నేర్చుకోవాలి. చంద్రబాబు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు. దేనినీ వదలిపెట్టరు. ఎటూ ఆయనకు మీడియా మద్దతు ఉంది కాబట్టి ఇక తాను అనుకున్నది చేసుకుని ముందుకు వెళతారు. ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేకతను ప్రభుత్వంపై తేవడంలో చంద్రబాబును మించిన వారు మరొకరు లేరు. గతంలో ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన సమరాన్ని చూసి కూడా నేడు వైసీపీ నేతలు నేర్చుకోలేకపోతున్నారు. చంద్రబాబు నాయుడు వచ్చిన ఏ అవకాశాన్ని జారవిడుచుకోరు. గతంలో సంక్రాంతి వచ్చిందటే చాలు.. భోగి నాడు నాటి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పండగ చేసుకునే వారు. ప్రభుత్వ ఉత్తర్వులను అందులో దహనం చేసేవారు. ఒక ఏడాది మూడు రాజధానుల ఉత్తర్వులు.. మరొక ఏడాది చెత్త పన్ను ఉత్తర్వులు.. ఇంకొక ఏడాది విద్యుత్తు బిల్లులు.. మరో ఏడాది నాసిరకం మద్యం ఇలా ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెళ్లేవారు. ఇక చివర ఏడాది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కు సంబంధించిన ఉత్తర్వులను కూడా భోగిమంటల్లో వేసి దగ్ధం చేసి మరీ ప్రజలకు చేరువయ్యారు. అందుకే ఆయనను ప్రజలు ఆదరించారు. సంక్రాంతి నాడు సెంటిమెంట్ ను పట్టించుకోకుండా కేవలం పొలిటికల్ ఆయింట్ మెంట్ ను పూసి మరీ ఆయన జనంలోకి చొచ్చుకెళ్లారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. కానీ సంక్రాంతి నాడు చేసింది శూన్యం. ఎవరింట్లో వారు నేతలు పండగ చేసుకున్నారు తప్పించి జనంలోకి వచ్చి సమస్యలను ప్రస్తావన తేలేకపోయారు. ఇది పూర్తిగా జగన్ వైఫల్యంగానే చూడాలి. ఎందుకంటే కనీసం గతంలో చంద్రబాబును చూసైనా జగన్ నేర్చుకోలేదని పిస్తుంది. అలాగే జగన్ కు చెప్పేవారు కూడా ఎవరూ లేరనే అనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదు. అలాగే విద్యుత్తు బిల్లులను పెంచారు. కానీ జగన్ పార్టీ మాత్రం భోగి మంటలు చేసుకుంది. కానీ పిడకలు వేసి కానిచ్చేసింది. ఇలా ఉంటే ఇక జనంలోకి ఎలా వెళతారు సామీ అని సొంత పార్టీ క్యాడర్ ప్రశ్నిస్తుంది. అంది వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవడంలో జగన్ కు మించిన వారు మరొకరు లేరంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

**ఆస్పత్రి ని అణువణువూనా పరిశీలించిన మంత్రి**

**టాయిలెట్స్, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంపై సంబంధిత అధికారుల నిలదీత**

ఏలూరు,మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఎక్కడ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కనపడకూడదని స్పష్టం చేశారు. ఓపీ సేవలు సరిగా అందకపోవడంపై ఆసుపత్రి వర్గాలపై అసహనం వ్యక్తం చేశారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహ వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో ఇటువంటివి పునరావతం కాకూడదన్నారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై రోగులను అడిగి వివరానికి తెలుసుకున్నారు ఇక, మగవారికి, మహిళలకు విడివిడిగా ఓపీ సేవలు సమర్థంగా అందేలా చూడాలని సూచించారు.. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో టాయిలెట్స్, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంపై అధికారులను నిలదీశారు.. నెల రోజుల్లో ఆస్పత్రిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.. తన ఆకస్మిక పర్యటనలో ఆసుపత్రిలో వివిధ విభాగాలని పరిశీలించారు. పలు మార్పులకు కీలక సూచనలు చేశారు.

## వైభవంగా ముసలమ్మ తల్లి జాతర

కాకినాడ,కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీ ముసలమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి జాతర ఊరేగింపు ను భక్త జనసందోహం మధ్య కోలాహలంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అయిన అనసూరి వంశీకులు గరగలకు పూజా కార్యక్రమాలను నిర్వహించుకుని, తొలి గరగ ను తలపై ఎత్తుకుని నృత్యం చేసి జాతరను లాంఛనంగా ప్రారంభించారు. గరగలు, కాళికాదేవి నృత్యం, నాశిక్ డోల్ నృత్యం, సానిమేళం, బ్యాండ్ మేళం, మరియు బ్రహ్మాండమైన లైటింగ్తో అమ్మవారి జాతర ఊరేగింపు ఇంద్రపాలెం గ్రామ పురవీధుల గుండా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చిరంజీవిపై కమలం గురి...

విజయవాడ, జనవరి 16,మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యంపార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసిన తర్వాత ఆ పార్టీ నాయకుడిగా మారారు. కానీ చివరికి రాజకీయాలపై అసంతృప్తితో వైదొలిగారు . తన రాజ్యసభ సభ్యత్వం ఇంకా రెండేళ్లు ఉన్నప్పటికీ ఆయన సభాసమావేశాలకు కూడా హాజరు కాలేదు. తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరమని ప్రకటించారు. సోదరుడు పవన్ కల్యాణ్‌కు మద్దతు పలికారు. అయితే చిరంజీవిపై బీజేపీ ప్రత్యేకమైన ఆసక్తిని చూపిస్తోంది. ప్రత్యేక ప్రాధాన్యత ను ఇచ్చి ఆయనను రాజకీయాల్లోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తోంది. గతంలో పలు మార్లు ప్రధాని మోదీ పాల్గొనే పర్యటనల్లో ఆయనకు అవకాశం కల్పించారు. అదే సమయంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ .. చిరంజీవితో ప్రత్యేక అనుబంధం కొనసాగిస్తున్నారు. గోవాలో ఓ సారి అవార్డు ప్రకటన సందర్భంగా.. మళ్లీ రాజకీయాల్లోకి వస్తారా అని అనురాగ్ ఠాకూర్ అడిగారు కూడా . అయితే చిరంజీవి మాత్రం నిర్మోహమాటంగా...తాను మళ్లీ ప్రత్యక్షరాజకీయాల్లోకి వచ్చేది లేదని స్పష్టం చేశారు. మధ్యలో వైసీపీ కూడా కూడా ఆయనకు రాజ్యసభ సీటు ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. దాన్ని చిరంజీవి కూడా ఖండించారు. తాను



ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానని చెప్పారు. అయినా బీజేపీ మాత్రం ఆయనను ఆకర్షించడానికి అదే ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీ నివాసంలో జరిగిన సంక్రాంతి సంబరాలకు.. చిరంజీవిని అతిథిగా ఆహ్వానించారు. ప్రత్యేకంగా ఆయననే ఆహ్వానించడం వెనుక ప్రత్యేకమైన సమీకరణాలు లేవని అనుకోలేమని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే బీజేపీ ఎం చేసినా పూర్తి స్థాయిలో రాజకీయ కోణంలోనే చేస్తుంది. ఇటీవల చిరంజీవికి రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ సీటు వస్తుందన్న ప్రచారం జరిగింది. రాష్ట్రపతి కోటాలో ఆయనకు రాజ్యసభ సీటు ఇవ్వడానికి.. రాజకీయ పార్టీల్లో చేరాల్సిన అవసరం లేదు. బీజేపీలో చేరాల్సిన అవసరం లేదు. రాష్ట్రపతి వివిధ రంగాల్లోని నిపుణులను రాజ్యసభకు నామినేట్ చేసే కోటా అది. అయితే కేంద్రం సిఫారసు మేరకే నామినేట్ చేస్తారు. గతంలో కాంగ్రెస్ తరపున రాజ్యసభకు ఎన్నికైనప్పటికీ చిరంజీవిపై బీజేపీ ప్రత్యేక అభిమానం చూపిస్తున్నందున కళాకారుని కోటాలో ఆయనకు చాన్స్ ఇవ్వొచ్చని చెబుతున్నారు. అయితే దీనికి చిరంజీవి అంగీకరిస్తారా లేదా అన్నది కూడా కీలకమే. రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ తీసుకుంటే.. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నట్లుగా కాదు. బీజేపీకి అనుకూలంగా మాట్లాడాల్సిన పని లేదు. కానీ.. బీజేపీ సానుభూతిపరుడిగానే అందరూ చూస్తారు. పవన్ కల్యాణ్ ఇప్పటికే బీజేపీతో పొత్తులో ఉన్నందున అలా చూడటం పెద్ద విషయం కాదు. ఇప్పటికే ఆయనను బీజేపీకి దగ్గరగానే చాలా మంది భావిస్తున్నారు. అందుకే రాష్ట్రపతి కోటాలో బీజేపీ పదవి ఇస్తే తీసుకోవడంలో తప్పు లేదని ఎక్కువ మంది భావిస్తున్నారు.

## మునిగిపోతున్న వ్యక్తిని కాపాడిన హోం గార్డ్

కాకినాడ,సరదాగా సముద్ర స్నానం చేస్తోండగా కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న వ్యక్తిని కాకినాడ మెరైన్ పోలీస్ స్టేషన్కు చెందిన హోంగార్డు ప్రాణాలకు తెగించి కాపాడాడు. జీవనోపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి కాకినాడలో ఉంటున్న వికాస్ పాండే అనే వ్యక్తి సంక్రాంతి సందర్భంగా సరదాగా గడిపేందుకు స్నేహితులతో కలసి బుధవారం సాయంత్రం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ కు వచ్చాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటాల ఉధృతికి కొట్టుకుపోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు అతని ప్రాణాలు కాపాడాడు..హోంగార్డును పలువురు సందర్శకులు,పోలీసులు అభినందించారు...

# ప్రమాదకరంగా మ్యాన్ హోల్
## ఎస్ డీ పీఐ పార్టీ నాయకులు



విభారెన్యూస్‌నంద్యాలమాప్రతినిధి జనవరి 16--నంద్యాల పట్టణం లోని 11 వార్డు చాంద్ బడా లో మూడు కూడళ్ళ రహదారిలో మ్యాన్ హోల్ కు మూత లేక వాహనదారులు మరియు పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎస్ డీ పీఐ నాయకులు ఆరోపించారు. పాదచారులు జారిపడి గాయాలపాలైనారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మ్యాన్ హోల్ కు కవచం లేకపోవడంతో అక్కడి స్థానికులు అధికారులకు తెలిపిన కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఎస్ డీ పీఐ నాయకులు హెచ్చరించారు.

# కోటి సభ్యత్వాలు సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి



శ్రీకాకుళం జనవరి 16 టిడిపి పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు క్రియాశీలక పాత్ర పోషిస్తున్న పార్టీ సభ్యత్వాలు ఈ రోజున పెద్ద ఎత్తున టిడిపి పార్టీ కార్యకర్తలు కోటి సభ్యత్వాలు స్వీకరించటం అనేది హర్షనీయమని, అలాగే భారతదేశంలో ప్రాంతీయ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున ప్రజాదారణ ఉండటం అనేది భారతదేశ రాజకీయాలలో టిడిపి పార్టీ ఎంత ప్రభావితం చేస్తుందనేది ఈరోజు కోటి పార్టీ సభ్యత్వాలు ప్రజలు తీసుకోవడం అనేది పార్టీపై ప్రజలకు ఉన్న నమ్మకం,విశ్వాసంను మరొకసారి రుజువైందని తెలుపుతూ ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం పంచాయతీలో టిడిపి పార్టీ కార్యకర్తలతో అలాగే నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పార్టీపై ఉన్న నిబద్ధతను,తన ప్రేమను, ఆనందాన్ని తెలియజేసిన విజయనగరం పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్ ఐటీ కమ్యూనికేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు గారు. అలాగే ఈ కార్యక్రమంలో ఎంపీ గారితో పాటు శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రణస్థలం పంచాయతీ ప్రెసిడెంట్ గారు పిన్నింటి బాలాజీ నాయుడు గారు, రాష్ట్ర ఎస్సీ సెల్ టిడిపి పార్టీ సీనియర్ నాయకులు ముక్కుఆదినారాయణ గారు, అలాగే టిడిపి పార్టీ సీనియర్ నాయకులు గొర్లె లక్ష్మణ్ గారు అలాగే మిగిలిన పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ పార్టీకి పట్టుకొమ్మలా పనిచేస్తున్న టిడిపి పార్టీ సీనియర్ నాయకులు రణస్థలం పంతులు గారిని ఎంపీ గారు దుస్సాలువతో సత్కరించినారు



# అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయండి

**రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు చేపట్టండి**
**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టి.జి. భరత్**





విభారే న్యూస్ కర్నూలుప్రతినిధి , జనవరి 16:- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టి.జి. భరత్ తెలిపారు..గురువారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారితో కలిసి ఆయా శాఖల అభివృద్ధి కార్యక్రమాల పై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టి.జి. భరత్ గారు సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు... అదే విధంగా ఇరిగేషన్ ప్రాజెక్టు లకు సంబంధించి ప్రాధాన్యత పరంగా ఏమి చేస్తే జిల్లాకు బాగుంటుందనే వివరాలను ఇవ్వాలని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.. పల్లె పండుగ కింద ఇంకా పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు.. అలాగే ఆర్ అండ్ బి ద్వారా పాట్ హోల్ ఫ్రీ కింద చేపడుతున్న రోడ్ల నిర్మాణానికి సంబంధించి గుంతలను పూడ్చే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు. ఇతర శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులను కూడా నిర్దేశించిన గడువు లోపల పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు..పుచ్చకాయలమాడ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న పనుల వివరాలను ఇవ్వాలని, రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు..... జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి పల్లె పండుగ కింద శాంక్షన్ చేసిన 830 పనులకు గాను 758 పనులను పూర్తి చేసి రాష్ట్రంలో 91 శాతం తో మొదటి స్థానంలో ఉన్నామని మంత్రి కి వివరించారు...ఆర్ అండ్ బి కి సంబంధించి 1074 కిలోమీటర్లకు గాను 884 కిలోమీటర్ల వరకు ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేసి 83 శాతం వరకు పనులను పూర్తి అయ్యాయని మంత్రికి వివరించారు.. మున్సిపాలిటీ పరిధిలో కూడా రోడ్ల మీద గుంతలు పూడ్చే పనులు జరుగుతున్నాయని, జనవరి చివరి నాటికి పెండింగ్ లో ఉన్న పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మంత్రికి వివరించారు.. అదే విధంగా ఇతర శాఖలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఫలితాలు సాధించేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు .సమావేశంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

# జిల్లాలలో మొబైల్ టవర్ల అభివృద్ధికి కృషి

## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 16--బిఎస్ఎన్ఎల్ కర్నూల్ బిజినెస్ ఏరియా టెలికాం అడ్వైజరీ కమిటీ 2024- 26 రెండు సంవత్సరాల కాలానికి మొదటి సమావేశం స్థానిక బిఎస్ఎన్ఎల్ భవన్ నందు గురువారం జరిగింది.ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు లు హాజరయ్యారు .నంద్యాల పార్లమెంటు నియోజకవర్గం లో టెలికాం సేవలను అభివృద్ధి చేస్తామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి అన్నారు.అదేవిధంగా నంద్యాల పార్లమెంటు నియోజకవర్గం నుంచి నియమించిన టెలికాం అడ్వైజరీ కమిటీ ( టిఏసి) మెంబర్లు పెరుమాళ్ళ విజయ్ కుమార్, మోమిన్ గౌస్ లాజం, చింతిబోయిన శ్రీనివాసులు, ఆడిక మధు, కురువ రమేష్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టెలికాం రంగానికి ఎంతగానో సపోర్టు చేస్తున్నదని, అత్యధిక బడ్జెట్ను బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కేటాయించిందని తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలకు మొబైల్ సిగ్నల్ అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు . ముఖ్యంగా రోళ్ళపాడు లాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతాలకు త్వరలో మొబైల్ టవర్లను ఏర్పాటు చేయించడానికి కృషి చేస్తానని తెలిపారు . బిఎస్ఎన్ఎల్ అధికారుల దృష్టికి టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్లు ఏ ఊర్లో టవర్లు లేవు , ఎక్కడ సిగ్నల్ తక్కువగా ఉందన్న విషయాలు సమగ్రంగా ప్రజలను కలిసి ఒక నివేదిక తయారు చేసి ఇవ్వవలసిందిగా ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కె .రాజేశ్వర రావు, ఐ .ఎఫ్. ఏ డి. శ్రీలత , ఏజీఎం ఆపరేషన్ పి. శ్రీనివాసరావు, ఏజీఎం అడ్మిన్ వి. శ్రీను నాయక్ , ఏజీఎం డోన్ జి.నారాయణ స్వామి, ఏజీఎం మొబైల్ ఇన్స్టాలేషన్ ఎన్. చంద్రశేఖర్, ఏజీఎం ట్రాన్స్మిషన్ జి. వి .మురళీకృష్ణ , ఏజీఎం ప్లానింగ్ వి. జాన్సన్, ఇతర బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు

# గుండెపోటుతో బిఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి



ధర్మవరం జనవరి 16 శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని నాగులబావి కాలనీకి చెందిన వెంకటరమణారెడ్డి (40) అనే బిఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ (ఆర్మీ ఉద్యోగి) ఈనెల 15వ తేదీ బుధవారం కాశ్మీర్లో గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. విధి నిర్వహణలో ఉండగానే ఇటువంటి సంఘటన చేసుకోవడం పట్ల తోటి ఆర్మీ ఉద్యోగులు ఎంతో బాధకు గురయ్యారు. కాశ్మీర్ లో అతి తక్కువ ఉష్ణోగ్రత వల్ల గుండెపోటుకు గురికావడం, వెంటనే మృతి చెందడం జరిగిందని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ సమాచారాన్ని ధర్మవరంలోని కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. మృతుడు వెంకట రమణారెడ్డికు భార్య హరిప్రియ, కుమారుడు మహిధర్ రెడ్డి, కుమార్తె రిత్విక ఉన్నారు. మృతదేహం కాశ్మీర్ నుండి ఢిల్లీకి, ఢిల్లీ నుండి బెంగళూరుకు ఆర్మీ వాహనం ద్వారా ధర్మవరం కు గురువారం రాత్రి చేరుకుంటుందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. మృతుడు వెంకటరమణారెడ్డి స్వగ్రామం చెన్నై కొత్తపల్లి మండలం బసనేపల్లి గ్రామంలో అంత్యక్రియలను నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకట రమణారెడ్డి ఆకస్మిక మృతికి స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మాజీ ఆర్మీ ఉద్యోగులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

# లేబర్ మొబిలైజేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

## జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 16-మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామపంచాయతీలో ప్రతిరోజు వందమంది ఉపాధి వేతనదారులకు పనులు కల్పించి నిర్దేశించిన లేబర్ బడ్జెట్ మొబిలైజేషన్ లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఉపాధి హామీ పథకం కింద నిర్ధేశించిన లేబర్ బడ్జెట్, హౌసింగ్ మ్యాండేస్, సచివాలయ సర్వీసులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్ మొబిలైజేషన్ కు సంబంధించి ఇంకా 16 లక్షల 5 వేల పని దినాలు కల్పించాల్సి ఉందని ప్రతిరోజు ప్రతి గ్రామపంచాయతీలో వందమంది ఉపాధి వేతనదారులకు పనులు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీఓ, ఎపిడి, ఎంపీడీఓలను ఆదేశించారు. సమయం తక్కువగా ఉందని నిర్దేశించిన లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని మండలాలు, గ్రామాల వారీగా రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రతి గ్రామపంచాయతీలో వందమంది ఉపాధి వేతనదారులకు పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటూ మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ మ్యాండేస్ క్రింద 90 రోజుల పని దినాలు ఉపాధి వేతన దారులకు కల్పిస్తే దినసరి సరాసరి రేటు పెరుగుతుందన్నారు. మంజూరు చేసిన 850 గోకులం షెడ్ల నిర్మాణాలకు గాను 276 మాత్రమే పూర్తి చేశారని మిగిలిన పశువుల షెడ్లను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ఇళ్ల నిర్మాణం కింద ఇటీవల నిర్దేశించిన 4,772 గృహ నిర్మాణాల లక్ష్యాన్ని మార్చి 31వ తేదీలోగా పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హౌసింగ్ డిఈ, ఏఈ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డ్వామా పీడీ జనార్దన్ రావు, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం కు హెల్మెట్ కారుకు సీటుబెల్టు తప్పనిసరి

## వన్ టౌన్ ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 16--ద్విచక్రం వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని వన్ టౌన్ ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా నంద్యాల రోడ్డు రవాణా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. మీరు చేసే ఒక చిన్న పొరపాటు వలన ప్రమాదంజరిగితే మీ కుటుంబం ప్రమాదంలో పడటమే కాకుండా ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. మీరు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు . నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ నందు రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని స్కూల్లో మరియు కళాశాలలో మరియు ముఖ్యమైన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. రోడ్డు భద్రత నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ఇందులో భాగంగా ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.కావున ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ , కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, అతివేగంగా అజాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల గురై ప్రాణాలు కోల్పోవద్దన్నారు.

# డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రిక్ హరికిషన్ దాడిని ఖండించిన ఆర్యవైశ్య సంఘం

(జనవరి 16) నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో ఈనెల 6 వ తేదీన మున్సిపల్ వైస్ చైర్మన్ పై జరిగిన హత్య యత్యాయత్యానికి నిరసనగా పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం కులస్తులు పెద్ద ఎత్తున పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిరసన తెలుపుతూ డి.ఎస్.పి శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మీడియాతో కోట్రికే హరి కిషన్ మాట్లాడుతూ తనపై జరిగిన కారు ప్రమాదంనీ విచారణ చేయమని పోలీసులకు విన్నవించడం జరిగిందని సీసీ కెమెరాలద్వారాకొంతమందినిందితులనుపోలీసులు విచారిస్తున్నట్లు తెలిపారు.కానీ ఈవిచారణలో నిందితులకి తనకు ఎటువంటి రాజకీయ కక్షలు లేవని కానీ తన మీద ఎందుకు హత్యాయత్నం చేశారు తెలియలేదని ఈ విషయాలన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇది కచ్చితంగా రాజకీయ కక్ష అని వైస్ చైర్మన్ కోట్రిక్ హరికిషన్ అన్నారు. గతంలోడోన్ నియోజకవర్గం లో కోట్ల,కేఈ కుటుంబాలు ఇలాంటి సాంప్రదాయాలు దూరంగా ఉండేవారని, తనపై జరిగిన హత్యాయత్నం చేయడం దుర్మార్గమని అని అన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190